నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, శనివారం 12 అక్టోబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

దసరా వచ్చిందయ్యా..

'జయ జయహే మహిషాసుర మర్ధిని, రమ్యక వర్ధిని శైల స్తుతే' సర్వ మంత్రాలు, వేలాది శాస్త్రాలు ఆ జననివే. ఆ తల్లి అనుగ్రహమే భక్తులకు కొండంత అండ. చెడుపై మంచి సాధించే విజయానికి చిహ్నంగా అశ్వయుజ శుద్ధ దశమి వేళ విజయ దశమిని జరుపుకొంటారు. శనివారం పండుగకు నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు సన్నద్ధమయ్యారు. ఈరోజు శమీ వృక్షానికి పూజలు చేసిన అనంతరం ప్రజలు పాలపిట్టను దర్శించుకోనున్నారు. అలాగే రావణాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో ఇప్పటికే ప్రతి ఇల్లు పండుగ వాతావరణంతో కళకళలాడుతోంది. మార్కెట్లన్నీ సందడిగా మారాయి.

– ఆత్మకూరు, అక్టోబర్ 11

- నేటి పండుగకు సిద్ధమైన ప్రజలు
- శమీపూజకు పూర్తయిన ఏర్పాట్లు
- సందడిగా మారిన మార్కెట్లు
- కిక్కిరిసిన ప్రయాణ ప్రాంగణాలు
- గ్రామాల్లో పండుగ వాతావరణం

ఆత్మకూరులో..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఉమ్మడి పాలమూరు జిల్లాలో కనులపండువగా జరుగుతున్నాయి. శుక్రవారం 9వ రోజు అలంపూర్‌లోని జోగుళాంబ దేవి సిద్ధిధాత్రిగా, శ్రీశైలంలోని భ్రామరి సిద్ధిదాయిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

– అలంపూర్/శ్రీశైలం, అక్టోబర్ 11

సరదాల దసరా.. తెలంగాణ ప్రజలకు అతిపెద్ద పండుగను శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఊరూవాడా సిద్ధమైంది. మనుషుల మధ్య కల్మషాలన్నింటినీ కడిగి పారేసి ప్రేమ, ఆప్యాయత, అనురాగాలను పంచిపెట్టే పర్వదినం. ఈరోజు ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు ధరించి సంతోషంగా జరుపుకోనున్నారు. వివిధ రకాల పిండివంటలు వండనున్నారు.

ముగియనున్న శరన్నవరాత్రి వేడుకలు

దేవీ శరన్నవరాత్రి వేడుకలు శనివారంతో ముగియనున్నాయి. 9 రోజులపాటు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గమ్మ చివరి రోజు మహిషాసురమర్ధిని రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నది. ఉత్సవాల సందర్భంగా అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పల్లె, పట్టణాల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. నగరాలు, పట్టణాల నుంచి ఆడపడుచులు, బంధువులు తరలి రావడంతో గ్రామాలు కళకళలాడుతూ పండుగ వాతావరణం కనిపిస్తున్నది.

దసరా విశిష్టత

పాండవులు వనవాసం వెళ్లి వచ్చి జమ్మి వృక్షంపై వారి ఆయుధాలు తీసిన రోజున దసరా పండుగను నిర్వహిస్తారు. ఈ రోజున అంతా మంచే జరగాలని వృత్తిదారులు వారి పరికరాలకు వాహనాలకు, యంత్రాలకు ఆయుధ పూజ నిర్వహించడం ఆనవాయితీ. శమీ వృక్ష కొమ్మలను తెంచి ఆలయాలను దర్శించుకొని పెద్దవారికి, తోటి వారికి అందించి పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు. కాగా వానకాలం సీజన్‌లో సాగు చేసిన పంటలు దసరా నాటికి రైతుల ఇండ్లకు చేరుతాయి. ఈ వచ్చిన ధాన్యం, పంటను దేవతలకు నైవేద్యంగా పెట్టి.. తర్వాత తినేందుకు.. విక్రయించేందుకు సిద్ధమవుతారు.

మార్కెట్లకు పండుగ శోభ

దసరా పండుగను పురస్కరించుకొని మార్కెట్‌కు పండుగ కళ వచ్చింది. ఐదు జిల్లాల్లోని దుకాణాల్లో సామాగ్రి కొనుగోళ్లు చేయడంలో జనం బిజీబిజీగా గడిపారు. షాపింగ్ మాల్స్ కిక్కిరిసిపోగా.. పూలకు గిరాకీ పెరిగింది. కిరాణం, బట్టల, బంగారం, టైలరింగ్, పూజా సామగ్రి దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. బంతిపూల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిలో ధర రూ.150 వరకు పలుకుతున్నాయి. వాహనాలు, బస్సుల రాకపోకలు పెరగడంతో రోడ్లపై రద్దీ పెరిగింది. మామిడి తోరణాలు, బంతిపూలు, గుమ్మడికాయలకు డిమాండ్ నెలకొన్నది. నిన్న, మొన్నటి వరకు అంతంత మాత్రంగానే ఉన్న మార్కెట్లు నేడు కళకళలాడుతున్నాయి.

ప్రజలకు నిరంజన్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు

వనపర్తి టౌన్, అక్టోబర్ 11 : చెడు ఎంత శక్తివంతంగా కనిపిస్తున్నప్పటికీ మంచితనమే చివరగా విజయం సాధిస్తుందని దసరా పండుగ గుర్తుచేస్తుందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం విజయ దశమిని పురస్కరించుకొని ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అసత్యంపై సత్యం సాధించిన విజయాన్ని వేడుకలా చేసుకునే ఈ దసరా, మీరు చేసే ప్రతి పనిలోనూ దుర్గాదేవి బలాన్ని, శక్తిని ప్రసాదించాలన్నారు.

పైపు ద్వారా నీటిని పట్టుకుంటున్న స్థానికులు

తాగునీటికి తండ్లాట

- మిషన్ భగీరథ పైపు లీకేజీ
- దుబ్బతండాలో తీవ్ర ఎద్దడి

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 11 : మండలంలోని దుబ్బతండా వాసులు తాగునీటి కోసం తండ్లాడుతున్నారు. గ్రామానికి మంచినీటిని అందించే మిషన్ భగీరథ నీటి పైపులైన్ లీకేజీ కావడంతో మూడ్రోజులుగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో పంచాయతీ కార్యదర్శి, తండా పెద్దలు వ్యవసాయ బోరు నుంచి ఓ పైపు ద్వారా నీటిని అందించగా.. మహిళలు, స్థానికులు ఒక్కసారిగా తరలివచ్చి పోటాపోటీగా నీటిని పట్టుకొన్నారు.

విద్యుదాఘాతంతో భార్యాభర్తలు మృతి

గోపాల్‌పేట్, అక్టోబర్ 11 : విద్యుదాఘాతంతో భార్యాభర్తలు మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు.. కొత్తబండరాయిపాకుల గ్రామానికి చెందిన దుసు బక్కయ్య(50), దుసు నాగమ్మ (46) శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా గుడిపల్లి గట్టుపైకి సీతాఫలాల సేకరణకు వెళ్లారు. అయితే అక్కడ ఉన్న కరెంట్ వైర్లకు ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృతి చెందారు.